నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
15 | హైదరాబాద్, మంగళవారం 5 మార్చి 2024 | HYDERABAD

90 శాతానికి పైగా చిన్నారులకు
చుక్కల మందు

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో రెండో రోజు పోలియో చుక్కల పంపిణీ విజయవంతంగా సాగింది. ఆదివారం పోలియో బూత్‌లలో చుక్కలు వేయించని చిన్నారులకు సోమవారం ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది చుక్కల మందు వేశారు. మొదటి రోజు మూడు జిల్లాల్లో దాదాపు 90 శాతానికి పైగా చిన్నారులకు చుక్కల మందు వేసిన సిబ్బంది..రెండో రోజు మరో 20 శాతం మందికి వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు పోలియో చుక్కల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు.

జేఎల్, పీజీటీ, టీజీటీ.. ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన వినోద్‌కుమార్‌ను సన్మానించి.. అభినందిస్తున్న సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత

-సుల్తాన్‌బజార్, మార్చి 4



ముషీరాబాద్ యూపీహెచ్‌సీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

కవాడిగూడ/హిమాయత్‌నగర్ మార్చి 4: విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన ముషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ. 57 లక్షలతో అభివృద్ధి పనులు, అలాగే సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) సంస్థ సహకారంతో డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ముషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్ఎసీ)ని , హిమాయత్‌నగర్ డివిజన్‌లోని దత్తానగర్‌లో బస్తీ దవాఖానను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, కార్పొరేటర్లు గౌసొద్దీన్, మహాలక్ష్మిరామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఒక్కరోజు ముచ్చటేనా?
గుప్పెడు మందికే జీరో బిల్లులు

ఎన్నికల్ కోడ్ అంటూ రెండో తేదీ నుంచే సాధారణ బిల్లుల జారీ
రంగారెడ్డిలో జూన్ వరకు గృహజ్యోతి లేనట్లే

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఆరు గ్యారెంటీల అమలు కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు అడుగడుగునా నిరాశే ఎదురవుతున్నది. 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లుల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆశించిన లబ్ధిదారులకు అది ఒక్కరోజు మురిపెంగానే మిగిలింది. సీఎం రేవంత్‌రెడ్డి అట్టహాసంగా గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించేందుకు జిల్లాలోని చేవెళ్లను ఎంపిక చేసుకున్నారు. తీరా... మహబూబ్‌నగర్-రంగారెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చిందంటూ.. ప్రభుత్వ ఖర్చుతో చేపట్టిన ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి వినియోగించుకున్నది. ఈ నేపథ్యంలో కోడ్ ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు జిల్లాలో పథకాన్ని ప్రారంభించకుండా ఉండాలి. కానీ ఒకటో తేదీన పలు ప్రాంతాల్లో జీరో బిల్లులను జారీ చేసి.. ఘనంగా ప్రచారం చేసుకున్నారు. అయితే మరుసటి రోజు నుంచే కోడ్ ఉందంటూ పథకాన్ని అటకెక్కించారు. ఒకవైపు ఎమ్మెల్సీ.. రేపోమాపో పార్లమెంటు ఎన్నికల కోడ్‌తో రంగారెడ్డి జిల్లా ప్రజలకు జూన్ దాకా 'గృహజ్యోతి' అందే అవకాశాలు లేవు.

ఆరు గ్యారంటీల్లో..

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగమైన గృహజ్యోతి ఉమ్మడి రంగారెడ్డి పరిధిలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ప్రచారం కోసం నామమాత్రంగా గుప్పెడు మందికి జీరో బిల్లులను జారీ చేసిన టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు.. ఆపై కోడ్ పేరిట పథకం అమలును నిలిపివేశారు. సాధారణ కరెంటు బిల్లులను జారీ చేస్తూ ముక్కుపిండి చార్జీలను వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఈ పథకాన్నీ సీఎం రేవంత్‌రెడ్డి గత నెల 27న ప్రారంభించారు. తొలుత పథకం ప్రారంభానికి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్లను ఎంపిక చేసుకున్నారు. అయితే గత నెల 26న నల్గొండ-మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ జారీ అయింది. ఈ రెండు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ప్రభుత్వం పథకం ప్రారంభ వేదికను సచివాలయానికి మార్చింది. అయితే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అసలు టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో జీరో బిల్లుల జారీనే చేపట్టవద్దు. కానీ ఈ నెల 1న జిల్లాలోని అనేక చోట్ల మీటర్ రీడర్స్ వేలాది మందికి జీరో బిల్లులను జారీ చేశారు. వాటికి అట్టహాసంగా ప్రచారాన్ని కల్పించారు. కొన్నిచోట్ల ఉదయం 11 గంటల వరకు జీరో బిల్లులు జారీ చేసి, ఆ వెంటనే నిలిపివేశారు.

మరుసటిరోజే నిలిపివేత..

ఈ నెల 1న జీరో బిల్లులు జారీ చేసిన అధికారులు.. మరుసటి రోజు నుంచే దానిని నిలిపివేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున పథకం అమలు చేయొద్దంటూ అంతర్గతంగా ఆదేశాలు జారీ చేశారు. బయటికి ఎన్నికల కమిషన్ వద్దని చెప్పిందంటూ అధికారులు చెబుతున్నా... దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని ఎన్నికల కమిషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే షాద్‌నగర్ వంటి ప్రాంతాల్లోనైతే 1న ఉదయం 11 గంటల వరకు జీరో బిల్లులు జారీ చేసి.. ఆ వెంటనే దానిని నిలిపివేసి, జీరో బిల్లులు ఇచ్చిన వారికి తిరిగి సాధారణ బిల్లులు కూడా ఇచ్చారు. చేవెళ్లలోని షాబాద్ వంటి ప్రాంతాల్లో వందల మందికి జీరో బిల్లులు ఇచ్చి తదుపరి మీరు సాధారణ బిల్లులు చెల్లించాల్సిందేనని మీటర్ రీడర్లు లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలోనూ మొదటి రోజు జీరో బిల్లులు జారీ ఆపై నిలిపివేశారు. దీనిపై అధికారులను సంప్రదిస్తే.. ఏదో ట్రయల్ రన్ చేశామంటూ చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేయని ట్రయల్ రన్ ఇక్కడ మాత్రమే ఎందుకు చేశారనేది అధికారులకే తెలియాలి. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో జీరో బిల్లుల జారీకి యంత్రాలను తీసుకువచ్చి... ఆతర్వాత వాపస్ తీసుకుపోయారు. ఇలా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధుల్లో పథకం అమలు అనేది గందరగోళంగా మారింది.

జూన్ వరకు ఆగాల్సిందే..

రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చింది. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చినా.. ఆన్‌గోయింగ్ పథకం అయినందున దానిని కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కోడ్ కారణంగా ప్రారంభించలేదు. ఈ నెలలోనే పార్లమెంటు ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి రావడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ కోడ్ మే వరకు అమల్లో ఉండనున్నది. అంటే జూన్‌లో వచ్చే బిల్లుల సమయంలో మాత్రమే ఈ జిల్లాల వారికి పథకం అమలయ్యే అవకాశమున్నది. అంటే మూడు నెలల పాటు అర్హులైన లక్షలాది మంది లబ్ధిదారులు సైతం సాధారణ కరెంటు బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మూడు నెలల పాటు బిల్లులు చెల్లించిన లబ్ధిదారులకు ప్రభుత్వం తదుపరి రీయింబర్స్ చేస్తుందా? లేదా మరో రకంగా సర్దుబాటు చేసి లబ్ధిదారులకు ఏమైనా భరోసా ఇస్తుందా? అనేది తెలియాల్సి ఉన్నది.

మాకెందుకు రాలె
జీరో బిల్లు..

'మాది ఒక్కటే ఫ్లోర్.. కొందరికి జీరో బిల్లు వచ్చింది.. మాకెందుకు రాలేదం'టూ...వంద సంఖ్యలో లబ్ధిదారులు సోమవారం కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల పరిధి కార్యాలయాలకు చేరుకొని అధికారులను నిలదీశారు. ఏకకాలంలో లబ్ధిదారులంతా కార్యాలయాన్ని చుట్టుముట్టడంతో అధికారులు వారికి సమాధానం చెప్పలేక అయోమయానికి గురయ్యారు. చివరకు ఉపకమిషనర్ నర్సింహ స్పందించి.. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు. - కుత్బుల్లాపూర్, మార్చి 4

కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహను నిలిదీస్తున్న లబ్ధిదారులు

ప్రజావాణి అర్జీలు
త్వరితగతిన పరిష్కరించాలి
కమిషనర్ రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వచ్చే ప్రజావాణిలోగా దరఖాస్తులను పరిష్కరించి, అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ శాఖలకు సంబంధించి 67 విన్నపాలు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపించారు. చార్మినార్ జోన్‌లో 6, సికింద్రాబాద్‌లో 17, కూకట్‌పల్లిలో 58, ఖైరతాబాద్‌లో 4, ఎల్బీనగర్‌లో 17, శేరిలింగంపల్లిలో 18 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హెడ్ ఆఫీస్, జోన్లు కలిసి మొత్తం 187 దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణికి ముందు కమిషనర్ రోనాల్డ్ రాస్ ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా వినతులు స్వీకరించారు. అత్యధికంగా టౌన్ ప్లానింగ్ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీ జియావుద్దీన్, సీఈ దేవానంద్, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, చంద్రకాంత్‌రెడ్డి, గీతా మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఇలా పోస్టింగ్.. అలా ట్రాన్స్‌ఫర్
తరచూ స్థాన చలనం..అధికారుల్లో అసహనం

సిటీబ్యూరో: ఇలా పోస్టింగ్ ఇస్తున్నారో లేదో.. అలా బదిలీ జరిగిపోతున్నది. సిబ్బంది.. శ్రేయోభిలాషులు పూల బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపేలోపే మళ్లీ బదిలీ వేటు పడుతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖలో బదిలీల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నది. వరుస బదిలీలపై అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు కేవలం ఎన్నికల నియమావళి మేరకేనంటూ ఉన్నతాధికారులు చెబుతుంటే.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటున్నది. ఒక అధికారిని ఒక ప్రాంతానికి బదిలీ చేసిన మరుసటి రోజే తిరిగి ఆ ఉత్తర్వులు రద్దు చేయడం, స్థానచలనం అయిన అధికారిని అదే స్థానంలో పోస్టింగ్ కల్పించడం..ఇదేక్కడి ఎన్నికల నియమావళి అంటూ కొందరు అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం బదిలీలు చేస్తే.. సదరు అధికారికి సంబంధించిన పూర్తి వివరాల ఆధారంగానే పోస్టింగ్ కల్పిస్తారు. కానీ ఇప్పుడు జరుగుతున్న బదిలీల తంతులో ఒక అధికారిని ట్రాన్స్‌ఫర్ చేసి, కొత్త పోస్టింగ్ కల్పించిన వారం లోపే మళ్లీ స్థానచలనం చేయడం పలు విమర్శలకు తావిస్తున్నది.

శాంతిభద్రతలపై ప్రభావం..?

కొత్త పోస్టింగ్‌లు తీసుకున్న ఏసీపీలు ఆ ప్రాంతంపై పట్టు సాధించే లోపే బదిలీకావడం వల్ల స్థానికంగా శాంతిభద్రతలు పట్టు తప్పే ప్రమాదం లేకపోలేదంటున్నారు సీనియర్ అధికారులు. అలాగే ఈ మధ్య ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి డీసీపీ స్థాయిల వరకు తరచూ బదిలీలు జరుగుతుండడంతో కేసుల దర్యాప్తు మందగిస్తుందనే విమర్శలూ వినిపిస్తున్నాయి.

పలువురు అధికారుల అసంతృప్తి

ఎన్నికల నియమావళిలో భాగంగా బదిలీలు చేయాలంటే సదరు అధికారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి ఇందుకు అనుగుణంగా బదిలీ చేయాలి. అంతే తప్ప.. నాలుగు రోజులకోసారి అధికారులను బదిలీ చేయడం, ఒక చోట నుంచి బదిలీ చేసిన అధికారికి తిరిగి మళ్లీ అదే చోట పోస్టింగ్ కల్పించడం వంటి వ్యవహారాలపై పలువురు అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

5.3 ఎకరాల ఎఫ్‌టీఎల్ సేఫ్

సిటీబ్యూరో: శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి ఎడ్లవానికుంట ఆక్రమణకు జీహెచ్ఎంసీ అడ్డుకట్ట వేసింది. 5.3 ఎకరాల ఎఫ్‌టీఎల్ విస్తీర్ణంలో ఉన్న చెరువు స్థలాన్ని కొందరు పట్టేదారులు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి, కోర్టు ఆదేశాలను ఆసరా చేసుకొని చెరువును ఆక్రమించేందుకు కట్టను తెగకొట్టారు. చెరువులో బండరాళ్ల డంపింగ్ చర్యలు చేపట్టారు. స్పందించిన జీహెచ్ఎంసీ లేక్ విభాగం అధికారులు.. బండరాళ్లను తొలగించి.. అన్యాక్రాంతం కాకుండా కాపాడారు. సంబంధిత పట్టేదారులపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో గతేడాది జూలై 5న ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. సర్వే నంబర్ 71/1, 71/2 సంబంధించిన పట్టదారులు ట్యాంక్(చెరువు)బెడ్‌లోని భూమి తన ఆస్తి అంటూ పేర్కొంటూ.. హైకోర్టు ఆశ్రయించారు. సంబంధిత పట్టేదారులు ప్రకాశ్, రాజు ఎడ్లవానికుంట ప్రభుత్వ ఆస్తిని దెబ్బ తీసినందుకు జిల్లా కలెక్టర్‌కు జీహెచ్ఎంసీ అధికారులు నివేదిక అందించారు. కలెక్టర్ వారికి నోటీసు సైతం జారీ చేశారు. కాగా, ఎడ్లవానికుంట ఆక్రమణకు జరిగిన ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాలకు వేర్వేరుగా ప్రత్యేక తరగతి గదుల సముదాయాల నిర్మాణానికి అధికారులు సోమవారం శంకుస్థాపన చేశారు. పూర్వ విద్యార్థులు, సీఎస్ఆర్ కింద వచ్చిన నిధులతో ఈ నిర్మాణాలను చేపడుతున్నారు. కాగా, ఎలక్ట్రికల్ విభాగం క్లాస్‌రూం కాంప్లెక్స్ నిర్మాణానికి 5 కోట్ల విరాళం ప్రకటించిన పూర్వ విద్యార్థి గోపాల్ టీకే కృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 4:

అక్రమాల నిగ్గు తేల్చేందుకు.. హౌస్ కమిటీ

సిటీబ్యూరో: బల్దియాలో పారిశుధ్యం, ప్రకటన విభాగంలో అక్రమాలను నిగ్గు తేల్చేందుకు రెండు హౌస్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ప్రకటనలో విభాగంలో కార్తిక్ ట్యాక్స్, అడ్డగోలు హోర్డింగ్‌లతో జీహెచ్ఎంసీ ఖజానాకు వందల కోట్లు గండిపడుతున్నదని జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. పారిశుధ్య విభాగంలో అక్రమాలు, స్విపింగ్ యంత్రాల వినియోగంలో అవినీతిపై కార్పొరేటర్లు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రకటనలు, పారిశుధ్యంలో జరిగిన అక్రమాల నిగ్గు తేల్చేందుకు రెండు వేర్వేరు హౌస్ కమిటీలు వేస్తున్నట్లు ప్రకటించారు. వీటితో పాటు ప్రత్యేక విచారణ అధికారిని నియమించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు చొప్పున కార్పొరేటర్లను ఎంపిక చేసి రెండు హౌస్ కమిటీలు వేశారు. ఈ మేరకు బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ రెండు హౌస్ కమిటీల ఏర్పాటును ఆమోదించనున్నారు.

ఔటర్‌పై హిట్ అండ్ రన్
ఆర్మీ జవాన్ దుర్మరణం
ఢీకొట్టి పరారైన కారు డ్రైవర్
సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు

మణికొండ, మార్చి 4: హిట్ అండ్ రన్.. నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డుపై వేగంగా దూసుకొచ్చిన కారు..ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయపడిన జవాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన సోమవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రాందేవ్‌గూడ ఆర్టిలరీ సెంటర్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న కులాన్(34) నార్సింగి సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డును దాటుతుండగా, గచ్చిబౌలి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వెళ్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కులాన్ దుర్మరణం చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని.. ఐడెంటీ కార్డు ఆధారంగా మృతుడు జవాన్ కులాన్‌గా గుర్తించారు. ఘటనకు కారణమైన కారును గుర్తించేందుకు పోలీసులు ఆ మార్గంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా..రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఆర్మీ జవాన్ కులాన్ విధి నిర్వహణలో భాగంగా అక్కడికి వచ్చాడా..ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా.. అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.